క్లుప్తంగా

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

కోట: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం తేనెటీగలు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. కార్యాలయం వద్ద ఉన్న చెట్టుకు తేనెతుట్టె ఉంది. దాని నుంచి తేనెటీగలు ఒక్కసారిగా లేచి, అక్కడ ఉన్న వారిపై దాడి చేశాయి. దీంతో జనం భయపడి పరుగులు తీసి, అక్కడ దుకాణాల్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ క్రమంలో పద్మమ్మ, శ్రీలక్ష్మి, రమణయ్యలను తేనెటీగలు కుట్టడంతో గాయపడ్డారు. వారు కోట ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు.

ఘనంగా పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఓజిలి: మండలంలోని కొండవల్లిపాడు గ్రామదేవతలు దుర్గమ్మ, పోలేరమ్మ, అంకమ్మకు గ్రామస్తులు మంగళవారం పొంగళ్లు పెట్టారు. మేళతాళాలు నడుమ గ్రామస్తులంతా పొంగళ్లను ఊరేగింపుగా ఆయా ఆలయాల వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, పొంగళ్లు వండి, నైవేద్యం సమర్పించారు.

అధిక లోడ్‌తో ప్రమాదాలు

చిల్లకూరు: ఆటోల్లో పరిమితికి మించి అధికలోడ్‌తో ప్రయాణికులను తరలిస్తుండడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని ఎస్‌ఐ గోపాల్ అన్నారు. చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు కూడా ప్రయాణికులతో దురుసుగా వ్యవహరించకూడదని చెప్పారు.

జన జాగృతి సభను విజయవంతం చేయండి

గూడూరు: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న మాదిగల జన జాగృతి సభను విజయవంతం చేయాలని ఆ సమితి నాయకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. గూడూరులో ఆయన ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల కోకన్వీనర్ వంగపూరి పెంచలయ్య మాదిగ, నాయకులతో కలసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపి, భాస్కర్, గోవిందు, వినోద్‌కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

ఓజిలి: ఉపాధిహామీ పనులను మరింత వేగవంతం చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. ఓజిలిలోని ఎస్టీ కాలనీలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.272 నగదు గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట టీఏ మహేష్‌కుమార్, ఎఫ్ఏ వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

అవగాహన కల్పించాలి

నాయుడుపేటటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన, పౌష్టికాహారం తదితర విషయాలపై అంగన్ వాడీ కార్యకర్తలు వారి కేంద్రాల పరిధిలోని మహిళలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద పూర్వ ప్రాథమిక విద్య, జనబాగీదారి కార్యక్రమంపై మంగళవారం అంగన్ వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధి లోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

పక్కాగా అమలు చేయాలి

దక్కిలి: ప్రభుత్వ స్కూళ్లలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని డీ వడ్డిపల్లె హైస్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజశేఖర్, హెచ్ఎం జగదీష్ పాల్గొన్నారు.

ఆధార్ తప్పనిసరి

రాపూరు: ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వసుమతి పేర్కొన్నారు. రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి సూర్యధర్మేంద్ర, ఏఈ రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): నివాసాల మధ్య వేసుకున్న గడ్డివామి ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన బాలాయపల్లి మండలంలోని వెంగమాంబపురంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వెంగమాంబపురం గ్రామానికి చెందిన బాపన పెంచలయ్య తమ పశువుల మేత కోసం 400 మోపుల గడ్డిని వామి వేసుకున్నారు. గడ్డివామి సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు రాలి పడడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.



- గూడూరు మండలం మిట్టాత్మకూరు గ్రామానికి చెందిన యల్లా శ్రీధర్‌రెడ్డిది మధ్యతరగతి కుటుంబం. ఇతనికి కుమార్తె జాహ్నవి(9) ఉంది. ఈమెకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో డెంగీ ఫీవర్ వచ్చింది. ఆ బాలికను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యశ్రీకార్డులో ఆ బాలిక పేరు లేకపోవడంతో వైద్యం అందలేదు. శ్రీధర్‌రెడ్డి ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సచివాలయం సిబ్బంది 24 గంటల్లో ఆరోగ్యశ్రీ కార్డులో ఆ బాలిక పేరును చేర్చారు. తద్వారా ఆ బాలికకు చికిత్స అందింది.



- ఇనుకుర్తి రమాదేవిది గూడూరు మండలం సంతదానుపల్లె. ఈమెకు 3 ఎకరాల మాగాణి ఉన్నట్లు జాబితాలో చూపడంతో ఆమెకు వితంతు పెన్షన్, అమ్మఒడి పథకాలు ఆగిపోయాయి. అయితే వాస్తవానికి ఆమెకు మెట్ట పైరును మాగాణిగా పొరపాటును చూపడంతో ఆమె ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హురాలిగా జాబితాలో పేరొచ్చింది. దీంతో ఆమె అధికారులకు సమస్యను విన్నవించడంతో సచివాలయ సిబ్బంది ఆ పొరబాటును సరిచేసి ఆమెకు వితంతు పెన్షన్, అమ్మ ఒడి పథకానికి అర్హురాలిగా చేశారు. దీంతో ఆమె సంతోషించారు.

పల్లె ముంగిటే పాలన



విందూరు గ్రామ సచివాలయం

- సచివాలయాల వ్యవస్థతో గ్రామీణులకు చేరువైన సేవలు
- గ్రామాల్లోనే సమస్యల పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మండలం	:	గూడూరు
జనాభా	:	42,980
గ్రామ సచివాలయాలు	:	17
సచివాలయాల ద్వారా అందుతున్న సేవలు	:	593

గూడూరురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో ప్రజల తమ సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండేది కాదు. ప్రస్తుతం గ్రామాల్లోనే సచివాలయాల ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతున్నాయి. 2019 ఆగస్టు 15వ తేదీన సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి అందులో 12 విభాగాలకు చెందిన అధికారులను నియమించి గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంది. ప్రతి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, పశు సంవర్ధకశాఖ సహాయకుడు, డిజిటల్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, ఎనర్జీ అసిస్టెంట్(విద్యుత్), అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఆరోగ్యకార్యదర్శి(ఏఎన్ఎం), ఫిషరీస్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి(మహిళా పోలీసు)విభాగాలను ఏర్పాటు చేశారు.

ప్రజలకు అందుతున్న సేవలివీ..

సచివాలయాల ద్వారా ప్రజలకు 593 రకాల సేవలను అందిస్తున్నారు. ఏపీ సేవా సర్వీసులు, మీ సేవ, నాన్ మీసేవా సేవలు, ఆధార్ సేవలు, సీఎస్‌సీ సేవలు, ఐఆర్‌సీటీసీ(రైల్వే) సేవలు, బిల్లుల చెల్లింపుతోపాటు ప్రభుత్వం అందించే పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు, పట్టాదారు పాసు పుస్తకాలు, రిజిస్ట్రేషన్లు, అన్ని రకాల సంక్షేమ పథకాలకు సంబంధించిన సేవలను ప్రజలకు అందిస్తున్నారు.

రూ.40 లక్షలతో పక్కా భవనాలు

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల పక్కా భవనాల కోసం ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షల వ్యయంతో భవనం నిర్మించారు. ఈ క్రమంలోనే మండలంలో మొత్తం 17 సచివాలయాలుండగా ప్రస్తుతం విందూరు, మిట్టాత్మకూరు, కొమ్మనేటూరు, నెర్నూరు, చెన్నూరు–3 సచివాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన సచివాలయాలు చివరి దశలో ఉన్నాయి. భవనాలు లేని చోట అద్దె భవనాల్లో సచివాలయాలను నిర్వహిస్తున్నారు.

మా ఊళ్లోనే పాసుపుస్తకం మంజూరు



నాకు 40 సెంట్లు పొలం ఉంది. అయితే ఆ పొలానికి పట్టాదారు పాసుపుస్తకం లేదు. ఆ పాసు పుస్తకం కోసం ఆమె టీడీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. సచివాలయం ఏర్పాటైన తరువాత తహసీల్దార్ చొరవతో మా సొంతూరు రామలింగాపురంలోని సచివాలయంలో రూ.115 చలానా చెల్లించాను. వెంటనే నాకు పట్టాదారు పాసు పుస్తకాన్ని అందజేశారు. **- కేతు నారాయణమ్మ, రామలింగాపురం**

సచివాలయంలో కార్డు మంజూరు



ట్రాన్స్‌కో తప్పిదంతో నాకు కరెంటు బిల్లు ఎక్కువ వచ్చింది. ఆ కారణంతో గతంలో రేషన్ కార్డు తొలగించారు. వాస్తవానికి నాకు కరెంటు బిల్లు ఎక్కువ రాలేదు. ఈ విషయాన్ని నేను తహసీల్దార్‌కు విన్నవించాను. వీఆర్వో గ్రామంలో విచారణ జరిపి, కరెంటు బిల్లు పొరపాటును గుర్తించారు. గ్రామంలోని సచివాలయం ద్వారానే రేషన్ కార్డు మంజూరు చేశారు. **- నీలం మధుసూదన్‌రెడ్డి, రామలింగాపురం**

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి



కిలివేటికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

నాయుడుపేట: కాంట్రాక్ట్ జూనియర్ అధ్యాపకులను కూడా రెగ్యులర్ చేయాలని సీఎం దృష్టికి తీసుకుని వెళ్లాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు నాయుడుపేటలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు వినతి పత్రం అందజేశారు. ఐదేళ్ల కాలపరిమితిని ఎత్తివేస్తే కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్న అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని సూచించారు. తమని రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేశారని అర్హత ఉన్న తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేసి, సీఎం తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె సుగుణ, ఎస్ సుకీర్తి, టీ అనిత, ఎ లక్ష్మి, ఎస్ నాగమణి, ఎస్ సౌజన్యసుధ, పీ స్వర్ణ, తదితదరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పలు ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ రఘుబాబు

చిల్లకూరు: మత్స్యకార సొసైటీల్లో సభ్యులకు ప్రభుత్వం పలు పథకాలను అందిస్తుందని చిల్లకూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు తెలిపారు. మండలంలోని కడివేడు చెరువుకు సబంధించిన సొసైటీ సభ్యులతో తిమ్మనగారిపాళెంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేస్తుందని, ఆసక్తి కలిగిన వారు ముందుకు వస్తే రాయితీపై అవుట్‌లెట్ మంజూరు చేయిస్తామన్నారు.

ఆటపాటలతో విద్య



మాట్లాడుతున్న సీడీపీఓ మునికుమారి

కోట: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ మునికుమారి తెలిపారు. మండలంలోని ఊనుగుంటపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జనభాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అంజమ్మ, సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

సాగుపై అవగాహన కల్పించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ భవానీ

చిల్లకూరు: ఖరీఫ్‌లో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఏఓ గూడూరు భవానీ సూచించారు. మండలంలోని వల్లిపేడు, అన్నంబాక, ఉడతావారిపాళెం గ్రామాల్లోని ఆర్బీకేలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మూడు ఆర్బీకేల పరిధిలో సుమారుగా 400 ఎకరాల వరకు ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టారన్నారు. పంట సస్య రక్షణకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు వేదాద్రి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ



నగదు అందజేస్తున్న సుబ్బారావుయాదవ్

ఓజిలి: ఓజిలి ఎస్సీ కాలనీకి చెందిన వాకాటి ప్రవళికకు రూ.10 వేలు వైఎస్సార్‌బీమా నగదును ఉప సర్పంచ్ ఎం సుబ్బరావుయాదవ్ మంగళవారం పంపిణీ చేశారు. ప్రవళిక భర్త వాకాటి శ్రీనివాసులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆమెకు మట్టి ఖర్చులు కింద రూ.10 వేలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న, ఏఎన్ఎం సాయి చందన ప్రియ, వలంటీర్లు అనుషా, సౌజన్య పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న కౌన్సిలర్ షేక్ షబ్బీర్

అగ్రహారపేటలో..

నాయుడుపేటటౌన్: అగ్రహారపేటకు చెందిన షేక్ గౌస్‌బాషా భార్య షేక్ ఆశాకు మంగళవారం కౌన్సిలర్ షేయ్‌షబ్బీర్ చేతుల మీదుగా వైఎస్సార్ బీమా నగదు పంపిణీ చేశారు. అగ్రహార పేటలో నివాసముంటున్న షేక్ గౌస్‌బాషా (46) మంగళవారం గుండెపోటుతో మరణించారు. దీంతో మృతుడి భార్య షేక్ ఆశాకు 14 వార్డు కౌన్సిలర్ షేక్ షబ్బీర్ ప్రభుత్వ తక్షణ సహాయం కింద రూ.10 వేలు బీమా నగదును అందజేశారు. పరిపాలన కార్యదర్శి రజిత, సంక్షేమ కార్యదర్శి ప్రఫుల్లా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

సైదాపురం: రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని లింగసముద్రం, తిప్పిరెడ్డిపల్లెలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రీసర్వే చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడం, దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. లింగసముద్రం పంచాయతీలోని సుముద్రాలవారి కండ్రిగలో రీసర్వే చేయడంతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు నేటితో పరిష్కారం అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరప్రసాద్‌రాజు, ఆర్ఐ ఆశ్వర్థ నారాయణ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు పరిసరాల్లో పేకాట స్థావరాలపై మంగళవారం రాత్రి సెబ్ సీఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.2,200 నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది వెంకటేశ్వర్లు, రమణయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

జగనన్నతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యం



వెంకటగిరి: కిట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్

దక్కిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. మంగళవారం డీ.వడ్డిపల్లె జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. అలాగే దేవునివెల్లంపల్లె ఎస్టీ కాలనీలో సర్పంచ్ చింతపూడి సుజాత విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. మాజీ ఎంపీపీ వీ చెంచయ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఓజిలి: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కురుగొండ సహకార సంఘం అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి అన్నారు. మండలంలోని మానమాల ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని పాఠశాలల్లో విద్యా కానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతోషం రెట్టింపు

వెంకటగిరి: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ చేయడంతో వారు సంతోషం రెట్టింపు అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ, పాతకోట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యా కానుక కిట్లను అందజేశారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని పుదూరు సచివాలయం పరిధిలోని గొ్రపల్లెగుంట, మిట్టకండ్రిగ, అత్తలపాళెం తదితర గ్రామాల్లో మంగళ వారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు వారి విన్నవించిన సమస్యలను నమోదు చేసుకుని, వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కొన్ని సమస్యలను అక్కడే పరష్కరించేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేతోపాటు నాయకులకు గ్రామాల్లో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ మండల కనీ్వనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, రూరల్ జేసీఎస్ కన్వీనర్ ఓ కిషోర్ యాదవ్, కే రాజారెడ్డి, కే మాధవ రెడ్డి, బీ మల్లి కార్జునరెడ్డి, కే జయరామయ్య, నాయకులు గోనుపల్లి గురుమూర్తి, ఎంపీపీ ధనలక్ష్మి, సర్పంచ్ మల్లావు సుమతి, ఎంపీటీసీ కంచి సరసమ్మ, ఈదా రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు



గడపగడపలో బుక్‌లెట్ అందించి సమస్యలు తెలుసుకుంటున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నిండాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలంలోని పాకపూడి, గొట్టికాడు పంచాయతీల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సంక్షేమపథకాల అందుతున్నాయా? లేదా అని స్థానికులను ఆరా తీశారు. లబ్ధిదారులకు ఇప్పటివరకు వారు పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వీ కార్తీక్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎం గోపీకృష్ణారెడ్డి, వీ సుప్రజారెడ్డి, హరికృష్ణారెడ్డి, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎన్ సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యులు వేళ్ల సురేంద్ర, ముంగర సుజాత, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బాలయపల్లి మండల నేతలు

వెంకటగిరి: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ఆయన పట్టణంలోని ఎగువ బొప్పాపురం, సాలెకాలనీల్లో పర్యటించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ పీ ప్రభావతి, ఎంపీ నారాయణలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అందుతున్నాయా? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్‌లను అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జీ ఢిల్లీబాబు, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎన్ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్ వహిదా, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, న్యాయవాది కోటేశ్వరరావు, నాయకులు వీ కృష్ణయ్య, పోలయ్య, నాగరాజు, ఎస్థానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సింగర్ ధనంజయ, సమీర పాట కచేరి



గల్లీబాయ్ సద్దాం కామెడీ షో



మాట్లాడుతున్న సినీ హీరోయిన్ నేహాశెట్టి

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ తిరునాళ్లలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. సినీ హీరోయిన్ నేహాశెట్టి పలకరింపు అందరినీ అలరించింది. సినీ ప్లేబ్యాక్ సింగర్లు ధనుంజయ, సమీరా భరద్వాజ్ బృందం గీతాలాపన, తెలంగాణ ఫోక్ సింగర్ పద్మశ్రీ మొగలయ్య పాటకచ్చేరి ఆకట్టుకుంది. గల్లీబాయ్స్ సద్దాం బృందం హాస్యవల్లరి కడుపుబ్బ నవ్వించింది. డ్యాన్స్ మాస్టర్ చిట్టి బృందం, జూనియర్ చిరంజీవి కరీముల్లా డ్యాన్స్ బృందం నృత్య ప్రదర్శన అలరించింది. సినీ యాంకర్లు నందిని, స్వాతి మాటలు ఆకట్టుకున్నాయి.

మంచి అధికారిగా గుర్తింపు పొందాలి



ఏఓ స్వర్ణను సత్కరిస్తున్న ఆర్డీఓ, సిబ్బంది

గూడూరు: ఒక అధికారిగా పనిచేసిన చోట, ప్రజా సమస్యలను సొంత సమస్యలుగా భావించి, వాటిని పరిష్కరించి, మంచి అధికారిగా గుర్తింపు పొందాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారిగా పనిచేసి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని కలువాయి తహసీల్దార్‌గా బదిలీ అయిన జీ స్వర్ణను ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది సర్వ సాధారణమని, ఎక్కడ పనిచేసినా, ఆ ప్రాంత ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.

హాజరుశాతం పెంచాలి



మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

వెంకటగిరిరూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వేంకటేశ్వర్లు సూచించారు. బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల దీటుగా మెరుగైన విద్యాబోధన అందించడంతోపాటు నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ఉచితంగా యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగ్‌లు, షూతోపాటు జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

ట్యాబ్‌ల పంపిణీ

వెంకటగిరి: పట్టణంలోని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తన కార్యాలయంలో ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కౌన్సిలర్లు శేఖర్, గోపాలకృష్ణయ్య, మాడా జానకిరామయ్య పాల్గొన్నారు.